8న విద్యుత్తు బీసీ ఉద్యోగుల మహాసభ

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 19వ రాష్ట్ర మహాసభను 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు కే కుమారస్వామి ప్రకటనలో తెలిపారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మహాసభలో 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎంపీలు ఈటెల రాజేందర్, ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు వెల్లడించారు.

పల్లెల్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

డీపీవోల సమీక్షలో మంత్రి సీతక్క

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రతి పల్లెనూ ఆదర్శంగా తీర్చిదిద్దాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లిప్తంగా ఉండొద్దని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని గ్రామీణ మంచినీటి సరఫరా సెంట్రల్ ఆఫీసులో డీపీవోలతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిధుల వినియోగం, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, డైరెక్టర్ శ్రీజన తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సైన్స్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : విద్యార్థుల్లోని సైన్స్ ప్రతిభను వెలికితీసేందుకు, బాలశాస్త్రవేత్తలను గుర్తించేందుకు నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను 7నుంచి 9 వరకు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎస్ స్కూల్‌లో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు 830 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయికి ఎంపికచేస్తామని తెలిపారు.

ఎస్సీ కాలనీకి తాగునీటి కష్టాలు

- పది నెలలుగా రాని మిషన్ భగీరథ నీళ్లు
- వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్న కాలనీవాసులు
- ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని దళితకాలనీలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

గణపురం, జనవరి 5 : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సొంత మండలమైన గణపురంలోని దళిత కాలనీ ప్రజలు పది నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు రాక గోసపడుతున్నారు. అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడంతో కిలోమీటర్ల దూరం వెళ్లి.. ప్రైవేట్ బోరుబావుల నుంచి బిందెలతో తెచ్చుకొని దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఈ విషయమై దళితకాలనీ మహిళలు సంబంధిత అధికారులకు గోడును విన్నవించుకోగా, ఎస్సీ కాలనీకి పైపులైన్ సమస్య ఉందని, పూర్తి కాగానే నీళ్లిస్తామని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పది నెలలుగా తాగునీళ్లు లేక వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నామని, స్నానంతోపాటు దుస్తులు శుభ్రం చేసుకోవడానికి సైతం వ్యవసాయ బోర్లపైనే ఆధారపడాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ గోడు విని, దాహార్తిని తీర్చాలని కాలనీప్రజలు వేడుకుంటున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

పది నెలలుగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి భగీరథ నీళ్లు రావడంలేదు. అనేకసార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి, మిషన్ భగీరథ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళిత కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించాలి.

- కట్ల ప్రశాంతీశంకరయ్య, మాజీ సర్పంచ్

కరీంనగర్ జిల్లా రేకుర్తి కంటి దవాఖానలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్

నేత్ర వైద్యశాలకు హైకోర్టు న్యాయమూర్తి విరాళం

విద్యానగర్, జనవరి 5: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేకుర్తిలోని డాక్టర్ మడేకర్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఉదార నేత్ర వైద్యశాలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం దవాఖానను సందర్శించిన ఆయన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. పేదప్రజల కంటి ఆపరేషన్ల కోసం తన తండ్రి, టైక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్లూమ్స్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు పేరిట రూ.లక్ష విరాళంగా అందిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ మలేషియా అసోసియేషన్ అధ్యక్షుడు సైదం తిరుపతి రూ.50 వేల విరాళం అందిస్తున్నట్టు ప్రకటించారు. పేద ప్రజలకు అండగా నిలిచేందుకు ముందుకు వచ్చిన జస్టిస్ వేణుగోపాల్, తిరుపతిని దవాఖాన యాజమాన్యం సత్కరించింది.

పర్యాటక పటంలో కోటగుళ్లు, గణపసముద్రానికి చోటు

- టూరిజం శాఖ విడుదల చేసిన వీడియోలో స్థానం
- ప్రపంచవ్యాప్తంగా పర్యాటకశాఖ ప్రచారం

గణపురం, జనవరి 5 : పర్యాటకులను ఆకర్షించేందుకు పర్యాటక శాఖ చిత్రీకరించిన వీడియోలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని కాకతీయులు నిర్మించిన కోటగుళ్లు, గణపసముద్రం సరస్సు మత్తడికి చోటుదక్కింది. పర్యాటక అందాలు, వారసత్వ కట్టడాలుగా పేరొందిన గణపురం కోటగుళ్లు, గణప సముద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి సముచిత స్థానం కల్పించింది. రామప్ప దేవాలయం, భూదాన్ పోచంపల్లి, యాదగిరిగుట్ట, పాండవుల గుట్ట, నాగార్జునసాగర్, జోడేఘాట్‌లోయ, నల్లమల, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కిన్నెరసాని వైల్డ్ లైఫ్ శాంక్చురీ ప్రాజెక్టు, కుమ్రంభీం ప్రాజెక్టు, ఎస్సారెస్పీ (నందిపేట) వంటివి వీడియోలో ఉన్నాయి. సుమారు నిమిషం నిడివి గల వీడియోలో వీటిని పొందుపరిచారు.

డిప్యూటీ సీఎం సభ అట్టర్‌ప్లాఫ్

- భట్టి మాట్లాడకుముందే వెళ్లిపోయిన జనం
- ఖాళీ కుర్చీలతో సభ వెలవెలా
- జనాలను ఆపే ప్రయత్నం చేసిన పోలీసులు

గీసుగొండ, జనవరి 5 : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో నిర్వహించిన సభ అట్టర్ ప్లాఫ్ అయింది. విద్యుత్ ఉపకేంద్రాల శుంకుస్థాపన అనంతరం నిర్వహించిన నియోజకవర్గస్థాయి బహిరంగ సభ జనాలు లేక వెలవెలబోయింది. డిప్యూటీ సీఎం సభను విజయవంతం చేయడానికి నాలుగు రోజులుగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నియోజకవర్గంలోని 6 మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. సభకు ప్రజలను భారీగా తరలించాలని స్థానిక నాయకులకు టార్గెట్లు పెట్టారు. నియోజకవర్గం నుంచి 4వేలమంది సభకు వచ్చి ఉంటారని స్థానిక నాయకులు చెబుతున్నారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే జనాలు వెళ్లిపోవడం మొదలు పెట్టారు. డిప్యూటీ సీఎం ప్రసంగించే సమయంలో ప్రజలంతా వెళ్లిపోయారు. పోలీసులు ప్రజలను ఆపే ప్రయత్నం చేసినా జనం మాత్రం ఆగలేదు. డిప్యూటీ సీఎం మాట్లాడుతుండగానే సభ ప్రాంగణమంతా ఖాళీ అయ్యింది. తన ఎకరం 16 గంటల భూమిని సబ్‌స్టేషన్ కోసం లాక్కున్నారని, మొగిలిచెర్ల గ్రామానికి చెందిన మహిళా రైతు మేడ వరలక్ష్మి డిప్యూటీ సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని బయటకు పంపారు.

ఎల్ఈడీ స్క్రీన్‌లో డిప్యూటీ సీఎం ప్రసంగం, ఎదురుగా కనిపిస్తున్న ఖాళీ కుర్చీలు

ఉచిత కంటి వైద్యశిబిరంలో డ్రైవర్‌కు అద్దాలు అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి. చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

రోడ్డు ప్రమాదాల నివారణకు చొరవ చూపాలి

- లారీ డ్రైవర్లకు మంత్రి కోమటిరెడ్డి సూచన
- హైవేపై డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

చిట్యాల, జనవరి 5 : జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. జాతీయ రహదారిపై వెళ్లే భారీ వాహన డ్రైవర్ల కోసం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి వద్ద ఉన్న ఓ దాబా వద్ద ఆదివారం ఉచిత కంటి పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ – విజయవాడ రహదారిపై రోజూ 70 నుంచి 80 వేల వాహనాలు తిరుగుతున్నాయని, ఈ రహదారిపై ప్రమాదాలు నివారించేందుకు మొట్టమొదటిసారిగా జిల్లా యంత్రాంగం డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎవరికైనా దృష్టిలోపం ఉంటే ఈ శిబిరంలో పరీక్షలు జరిపి తక్షణమే కళ్లద్దాలు ఇస్తున్నారని తెలిపారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చేందుకు మే నెల చివరి నాటికి టెండర్లు పూర్తి చేసి, రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

కమీషన్ ఇస్తేనే చెక్కులు పాస్

- షాడో అధికారితో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- ఇబ్బందులు భరించలేక డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉద్యోగి

బీబీపేట్, జనవరి 5: గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్లు, విద్యుత్ దీపాలు, బోర్లు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర పనులకు పంచాయతీ కార్యదర్శులు అప్పు చేసి పనులు చేయిస్తున్నారు. వాటికి సంబంధించిన బిల్లులపై(చెక్కులపై) సంతకాలు పెట్టాలంటే మండల స్థాయి అధికారి ఒకరు ముడుపులు తీసుకుంటున్నట్లు సమాచారం. మండల కేంద్రలోని ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే పైఅధికారి వేధింపులు భరించలేక ఒకరు డిప్యుటేషన్‌పై వెళ్లారు. కిందిస్థాయి సిబ్బందిని చులకనగా చూస్తూ.. వెటకారంగా మాట్లాడుతున్నాడని వాపోతున్నారు. చిన్న, చిన్న విషయాలకు మెమోలు జారీ చేస్తూ, ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆవేదన చెందుతున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎక్కువగా సమావేశాలను నిర్వహించడంతో సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రంలో మీటింగులకు హాజరుకావడంతో గ్రామాల్లో నిర్వహించే అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతున్నదని తెలిపారు. ఇటీవల బీబీపేట మండల కేంద్రానికి చెందిన ఓ మాజీ ఎంపీటీసీ భర్త చేసిన పనులకు బిల్లులు మంజూరయ్యాయి. కమీషన్ ఇస్తేనే సంతకం చేస్తానని సదరు అధికారి తెలుపడంతో.. ఆఫీసర్ మాట్లాడిన మాటలను ఆయన స్థానిక విలేకరుల వాట్సాప్ గ్రూపులో పెట్టాడు. ఎందుకు కమీషన్ ఇవ్వాలని అధికారిని నిలదీశారు. బీబీపేటలోని ప్రధాన చౌరస్తాకు వచ్చి అధికారి మాట్లాడాలని తెలిపాడు. విషయం పలువురు గ్రామ పెద్దల వద్దకు చేరడంతో.. సద్దుమణిగినట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారి తీరు మార్చుకోవాలని కిందిస్థాయి సిబ్బంది అంటున్నారు.

శిథిలావస్థలో హాస్టల్

- శిథిలావస్థకు చేరిన ఐలాపూర్ హాస్టల్ భవనం
- ధ్వంసమైన పిల్లర్లు, పెచ్చులూడుతున్న స్లాబ్
- బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్న విద్యార్థులు
- కలెక్టర్ పరిశీలించినా కొత్త భవనానికి మోక్షం కరువు
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించిన ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ప్రమాదకరంగా మారిన పిల్లర్లను చూపుతున్న హాస్టల్ విద్యార్థులు

నందిపేట్, జనవరి 5: మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నది. గతంలో విద్యార్థులతో నిండుగా కళకళలాడిన హాస్టల్ ఇప్పుడు విద్యార్థుల సంఖ్య తగ్గి వెలవెలబోతున్నది. ప్రభుత్వ పెద్దలు, అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. 1974 అక్టోబర్ 10న గాంధీ స్మారక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం జలగం వెంగళరావు ప్రారంభించారు. పురాతన భవనం కావడంతో స్లాబ్, పిల్లర్లు పెచ్చులూడుతున్నాయి. ఫ్లోరింగ్‌పై నాపరాళ్లు కుంగిపోయాయి. కిటికీలు, తలుపులు దెబ్బతిన్నాయి. భవనానికి ప్రధాన ఆధారమైన పిల్లర్లు ధ్వంసమై ఇనుప చువ్వలు బయటికి వచ్చాయి. స్లాబ్ మొత్తం పెచ్చులూడి రోజుకొంత కింద పడుతున్నాయి. తాత్కాలికంగా పక్కన ఉన్న డైనింగ్ హాల్‌లో విద్యార్థులు రాత్రిపూట పడుకుంటున్నారు. స్థలం తక్కువ ఉండడంతో మంచాలను పక్కనపెట్టేశారు. నేలపై చాపలు వేసుకొని విద్యార్థులు నిద్రపోతున్నారు. డైనింగ్ హాల్‌కు కింద నాపరాళ్ల చల్లదనం, కిటికీలకు తలుపులు లేక విద్యార్థులు చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంటశాల గది స్లాబ్ కూడా పెచ్చులూడి పడుతున్నాయి. అందులో వంట చేసేందుకు వంట మనుషులు జంకుతున్నారు. హాస్టల్ ఆవరణలో వానాకాలంలో నీరు నిలిచి బురద గుంటగా మారుతున్నది. స్నానపు గదులు, మూత్రశాలలు శిథిలావస్థకు చేరాయి. విద్యార్థులు ఆరుబయటనే స్నానాలు చేస్తున్నారు.

కలెక్టర్ పరిశీలించి వెళ్లినా మారని దుస్థితి

ఐలాపూర్ హాస్టల్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు నాలుగు నెలల క్రితం వానకాలంలో పరిశీలించారు. అయినా ఎలాంటి పురోగతీ కనిపించలేదు. ఇటీవల శాసనసభ శీతాకాల సమావేశాల్లో ఈ హాస్టల్ దుస్థితిపై ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ప్రస్తావించారు. కొత్త భవనం నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. హాస్టల్‌లో ఇంతటి దుస్థితి నెలకొన్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పెచ్చులూడి బయట పడిన ఇనుప చువ్వలు

ఊడిపోయిన కిటికీ తలుపులు

ఎవరూ పట్టించుకోవడం లేదు

హాస్టల్‌ను ఎవరూ పట్టించుకోవడం లేదు. డైనింగ్ హాల్ లో ఉండడం ఇబ్బందికరంగా ఉంది. కొత్త భవనాన్ని వెంటనే నిర్మించాలి. భవనం ఇలాగే ఉంటే మేము కూడా మా ఇండ్లకు వెళ్లిపోతాం.

- లచ్చిరాం, పదో తరగతి

చలికి వణికిపోతున్నాం

డైనింగ్ హాల్‌లో కిటికీలకు తలుపులు సరిగా లేవు. మంచాలు లేవు. కింద పడుకుంటున్నాం. దీంతో ఆరు బయట పడుకున్నట్లే ఉంది. తీవ్రమైన చలికి వణికిపోతున్నాం.

- పవన్‌కుమార్, ఐదో తరగతి

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

డిచ్‌పల్లి, జనవరి 5 : జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగమణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్కూల్ గేమ్స్ మహారాష్ట్రలోని జుల్గావ్‌లో ఉన్న ఛత్రపతి శివాజీ మహరాజ్ స్టేడియంలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే 68వ స్కూల్ గేమ్స్ జాతీయసాఫ్ట్ బాల్ అండర్–17 పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు బాలబాలికల పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. బాలికల విభాగంలో ఎస్.నిత్యశ్రీ (జడ్పీహెచ్ఎస్ –తొర్లికొండ), డి.అశ్విని (జడ్పీహెచ్ఎస్ –ముచ్కూర్), జి.సాత్విక, జి.శ్రావిక (టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ గర్ల్స్ –సుద్దపల్లి), బాలుర విభాగంలో ఎం.నిఖిల్ చంద్ర (నారాయణ హైస్కూల్ –ఆర్మూర్), ఎస్.సిద్ధార్థ (సత్యశోధక్ పాఠశాల–సిరికొండ), ఎస్.లక్ష్వేందర్ కుమార్ (టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ – బోధన్), ఎన్.ప్రణయ్ (టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ –ఉప్పల్‌వాయి) ఎంపికైనట్లు వివరించారు. జట్లకు కోచ్ మేనేజర్లుగా మార్కంటి గంగామోహన్, సోప్పరి వినోద్, ప్రశాంత్‌కుమార్, బి.అంజలి వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ సదస్సులో గుంజీళ్లపై అవగాహన

సదస్సులో అవగాహన కల్పిస్తున్న అందె జీవన్‌రావు

డిచ్‌పల్లి, జనవరి 5 : అంతర్జాతీయ సదస్సులో రాష్ట్ర అవార్డు గ్రహీత, గుంజీళ్ల మాస్టర్‌గా ప్రసిద్ధిచెందిన అందె జీవన్‌రావు 'కృత్రిమ మేధతో కూడిన సూపర్ బ్రెయిన్ యోగా – మెరుగైన జ్ఞాపకశక్తి, సమాజ క్షేమం' అంశంపై ఆదివారం పరిశోధనా పత్రం సమర్పించి మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగరాజ్‌లో సంజీవని వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నార్త్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్‌లో ఈనెల 2 నుంచి 6వ తేదీ వరకు గ్లోబల్ ఆయుష్ మహాకుంభ్ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన సూపర్‌బ్రెయిన్ యోగా గుంజీళ్ల మెరుగైన విధానమని, ఈ యోగాతో మెదడు చురుకుదనం పెరిగి జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని తాజా పరిశోధనలు తెలియజేస్తున్నాయన్నారు. ఆ పరిశోధన వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కృత్రిమ మేధను సూపర్‌బ్రెయిన్ యోగాతో అనుసంధానించడంతో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు. ప్రయాగరాజ్ సంజీవని వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు మెమెంటోతో అందె జీవన్‌రావును సత్కరించారు.

వివరాలను వెల్లడిస్తున్న సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్

వృద్ధురాలిని చంపింది అల్లుడే !

- సారంగపూర్‌లో జరిగిన హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడు 30 కేసుల్లో నేరస్తుడు
- సౌత్ రూరల్ సీఐ సురేశ్ కుమార్ వెల్లడి

వినాయక్‌నగర్, జనవరి 5 : నగర శివారులోని సారంగపూర్‌లో ఈనెల 3 జరిగిన వృద్ధురాలి హత్య కేసులో నిందితుడు ఆమె అల్లుడేనని పోలీసులు వెల్లడించారు. నిందితుడిని సారంగపూర్‌లో పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సారంగపూర్ గ్రామంలో నివసించే దుబ్బాక సాయమ్మ (62) ఈనెల 3న ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో హత్యకు గురికాగా.. ఆమె రెండో కూతురు సుజాత ఫిర్యాదు మేరకు ఆరో టౌన్ ఎస్సై వెంకట్‌రావు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. హత్య కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఆమె రెండో కూతురు భర్త లక్ష్మణ్‌ను అనుమానితుడిగా గుర్తించి, అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరాన్ని అంగీకరించాడని వెల్లడించారు. తనను సాయమ్మ తరుచూ దొంగ అని పిలుస్తూ అవమానించేందని, తన ఇంటికి రావొద్దని అనడంతో ఆగ్రహంతో హత్య చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. ముందుగా సాయమ్మ మెడకు షూ లేస్‌తో ఉరి వేసి, రోకలి బండతో తలపై కొట్టి హత్య చేసినట్లు విచారణతో తేలిందని చెప్పారు. అనంతరం సాయమ్మ ఒంటిపై ఉన్న బంగారు నగలు తీసుకొని పారిపోయాడని తెలిపారు. సదరు నిందితుడిపై ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 30 చోరీ కేసులు ఉన్నాయని, మాక్లూర్ మండలంలో ఓ హత్య కేసులో సైతం నిందితుడు జైలుకు వెళ్లి వచ్చాడని వివరించారు. నిందితునిపై కేసు నమోదు చేసి, బంగారు నగలు, వెండి పట్టగొలుసులు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. హత్యకేసును ఛేదించేందుకు కృషిచేసిన ఆరో టౌన్ ఎస్సై వెంకట్‌రావు, మోపాల్ ఎస్సై యాదగిరిగౌడ్ తోపాటు సిబ్బందిని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి అభినందించారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

కంఠేశ్వర్, జనవరి 5 : నగరంలోని కెప్టెన్ బ్యాడ్మింటన్ హబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ –2025 పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా నుంచి 73 జట్లు పాల్గొన్నాయి. కెప్టెన్ బ్యాడింటన్ హబ్ నిర్వాహకుడు కిరణ్, ఎన్‌జీఎస్ సంతోష్ పోటీలను ప్రారంభించారు. ఈ దిశగా కెప్టెన్ బ్యాడ్మింటన్ హబ్ సీనియర్ క్రీడాకారులు పసుల అరవింద్, షాదుల్లా ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. క్రీడల నిర్వాహకులు మల్లన్న, రాజు, శౌరబ్, విజయ్, శ్రీనివాస్, వంశీ పాల్గొన్నారు.

పోటీలో తలపడుతున్న క్రీడాకారులు